

విద్యార్థులకు మోదీ గిఫ్ట్

- రేపు హుస్నాబాద్‌లో పంపిణీ చేయనున్న కేంద్రమంత్రి బండి సంజయ్

హుస్నాబాద్ టౌన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రేపు హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మోదీ గిఫ్ట్ పేరిట కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేయనున్నారు. ఈ మేరకు గురువారం బీజేపీ కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు మార్కెట్‌యార్డును పరిశీలించారు. బండి సంజయ్ జన్మదినం సందర్భంగా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మోదీ గిఫ్ట్ పేరిట 20వేల సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టారన్నారు. అందులో భాగంగానే కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్ నియోజకవర్గాల్లో పంపిణీ చేసినట్లు చెప్పారు. శనివారం హుస్నాబాద్‌లో బండి సంజయ్ సైకిళ్లను పంపిణీ చేస్తారని తెలిపారు. ఆయన వెంట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, సెంట్రల్ సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, దొడ్డి శ్రీనివాస్, తోట స్వరూప, బూక్య సంపత్‌నాయక్, రామంచ మహేందర్‌రెడ్డి, తగరం లక్ష్మణ్, చందు, మహేశ్వర్, బైరి అరుణ్ ఉన్నారు.

ఒకేరోజు నాలుగు పుణ్యక్షేత్రాలు

- ఆర్టీసీ బంపర్ ఆఫర్.. నేటి నుంచి ప్రారంభం

సిద్దిపేట అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): దైవ దర్శనాలకు వెళ్లే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఒకే రోజులో నాలుగు పుణ్యక్షేత్రాలను దర్శించుకునే సౌకర్యాన్ని సిద్దిపేట ఆర్టీసీ కల్పించింది. సిద్దిపేట నుంచి బయలుదేరే బస్సు మొదటగా వర్గల్ సరస్వతి క్షేత్రం, నాచారం నరసింహస్వామి క్షేత్రాన్ని దర్శించుకుని అక్కడి నుండి యాదాద్రికి బయలుదేరుతుంది. దర్శనం పూర్తయిన తర్వాత స్వర్ణగిరికి వెళ్లి దర్శనం చేసుకుని తిరిగి సిద్దిపేటకు చేరుకుంటారు. ఆయా పుణ్యక్షేత్రాల ప్రాముఖ్యతను వివరించడానికి ఒక గైడును కూడా ఏర్పాటు చేశారు. పెద్దలకు రూ.540, పిల్లలకు రూ.300 చొప్పున టికెట్ నిర్ణయించింది. 50 మంది పూర్తి కాగానే ఒక ట్రిప్పును ప్రారంభిస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు 50 మంది రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో నేడు ఉదయం మొదటి ట్రిప్పు పుణ్యక్షేత్రాలకు బయలుదేరనుందని త్వరలో తిరుపతి, అరుణాచలానికి కూడా ఇదే ఆఫర్‌ను ప్రకటించే అవకాశం ఉందని ఆర్టీసీ మేనేజర్ టి.రఘు తెలిపారు.

గిరాయిపల్లి యాదిలో..

ఎన్‌కౌంటర్‌కు నేటితో 50 ఏళ్లు




అమరుల త్యాగాలకు ప్రతీకగా గిరాయిపల్లి అడవుల్లో నిర్మించిన స్థూపాలు

దేశంలో ఎమర్జెన్సీ విధించాక తొలి ఎదురుకాల్పులు

- నలుగురు 'రాడికల్' విద్యార్థుల కాల్చివేత
- నాటి ప్రధాని మొరార్జీ దేశాయ్, మంత్రి జార్జి ఫెర్నాండేజ్‌ల దృష్టికి తీసుకెళ్లిన పౌరహక్కుల నేతలు
- ఆనాడు లోక్‌సభలో చర్చ.. జస్టిస్ భార్గవ కమిషన్ ఏర్పాటు
- యాభై ఏళ్ల త్యాగాలను గుర్తుచేసుకుంటున్న విప్లవాభిమానులు





సిద్దిపేట జిల్లా కొండపాక మండలం గిరాయిపల్లి అడవుల్లో 1975 జూలై 25న జరిగిన ఎన్‌కౌంటర్‌కు నేటితో 50 సంవత్సరాలు. ఆ రోజు కూడా శుక్రవారమే కావడం గమనార్హం. 1975లో దేశంలో ఎమర్జెన్సీ విధించిన కొద్దిరోజులకే దేశవ్యాప్తంగానే కాకుండా ఏకంగా లోక్‌సభలోనూ చర్చకు దారి తీసింది. ఆ తర్వాత సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ వశిష్ట భార్గవ పేరిట కమిషన్ ఏర్పాటయ్యింది. గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ నేపథ్యంలో కొత్తగా ఆనాడు గిరాయిపల్లి నక్సల్స్ దళం పుట్టుకొచ్చి మెతుకుసీమ పల్లెల్లో చెరగని ముద్ర వేసింది. గిరాయిపల్లి నుంచి ఢిల్లీలోని కేంద్ర మంత్రులు, ప్రధాని, లోక్‌సభ, సుప్రీంకోర్టు వద్ద అప్పట్లో చర్చనీయాంశమైంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జూలై 24

కృష్ణా జిల్లా ఉయ్యూరు సమీపంలోని గరికపర్రులో జన్మించిన సూరపనేని జనార్ధన్ 1970లో వరంగల్‌లోని రీజనల్ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ కోర్సులో చేరారు. సహజంగానే అభ్యుదయ భావాలు కలిగిన కుటుంబంలో జన్మించిన జనార్ధన్ వరంగల్ ప్రాంత విప్లవ భావాలకు ఆకర్షితులయ్యారు. 1974లో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతుండగా వరంగల్ జిల్లా ముస్త్యాలపల్లికి చెందిన లంకా మురళీమోహన్‌రెడ్డి (మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ మాజీ సభ్యుడు లంకా పాపిరెడ్డి సోదరుడు), దేశాయిపేటకు చెందిన సుధాకర్, బుధరావుపేటకు చెందిన ఆనందరావులతో చనువు ఏర్పడింది. వీరితో కలిసి నిత్యం ప్రజల్లో తిరిగేవారు.

మెతుకుసీమలో విప్లవబాట..

రాడికల్ విద్యార్థి సంఘ నాయకుడైన జనార్ధన్ తన ముగ్గురు సహచరులైన మురళీమోహన్, ఆనందరావు, సుధాకర్‌తో కలిసి అప్పటి పీపుల్స్‌వార్ ఆదేశాల మేరకు మెదక్ జిల్లాలో విప్లవోద్యమ విస్తరణకు శ్రీకారం చుట్టారు. 1974లో సిద్దిపేట కేంద్రంగా ఈ బృందం తమ కార్యకలాపాలు ప్రారంభించి కళాశాలల్లో విద్యార్థులను, పట్టణాల్లో కార్మికులను, గ్రామాల్లో రైతులు, కూలీలను చైతన్యం చేశారు. కొండపాక మండలం సిర్సనగండ్లలో ఒక వడ్డీ వ్యాపారిని హత్య చేయడంతో ఈ బృందం పోలీసులకు టార్గెట్‌గా మారింది. 1975 మార్చిలో దేశవ్యాప్తంగా అత్యవసర పరిస్థితి విధిం

మిగతా7వ పేజీలో



నాట్లు ముమ్మరం

జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. అధికశాతం రైతులు వరినాట్లు ముమ్మరం చేశారు. సిద్దిపేట చుట్టూ పక్కల గ్రామాల్లో ఒకేసారి వరినాట్లు మొదలవడంతో కూలీల కొరత ఏర్పడింది. దింతో రైతులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లాకు చెందిన మహిళా రైతు కూలీలను తీసుకొస్తున్నారు. వీరు ఎకరాకు రూ.5500 తీసుకుని నాట్లు వేస్తున్నారు.

- సిద్దిపేట ఫొటోగ్రాఫర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి)



జోరు వాన

- బుధవారం అర్ధరాత్రి దంచికొట్టింది..
- గరిష్టంగా 86.5 మి.మీ వర్షపాతం నమోదు
- పొంగిపొర్లుతున్న చెరువులు
- నిన్నా అక్కడక్కడ చిరుజల్లులు

సిద్దిపేట జూలై 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు వర్షం దంచికొట్టింది. జిల్లాలోని పలు రోడ్లు కుంటలను తలపిస్తుండగా, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. జిల్లాలో గరిష్టంగా 86.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. గురువారం ఉదయం జిల్లాలోని పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. జిల్లాలోని సిద్దిపేట అర్బన్, దుబ్బాక, కుకునూర్‌పల్లి, చిన్నకోడూర్, తొగుట, దౌల్తాబాద్, దుబ్బాక, అక్బర్‌పేట-భూంపల్లి, కొమురవెల్లి, మర్కుక్ మండలాల్లో ఉదయం చిరుజల్లులు కురిశాయి. రాత్రి కురిసిన భారీ వర్షానికి జిల్లాలోని మందపల్లి, నర్సాపూర్, ఇబ్రహీంపూర్ చెరువులు పొంగిపొర్లుతున్నాయి.

సిద్దిపేట అర్బన్ మండలంలో 86.5 మిల్లీమీటర్లు, సిద్దిపేట రూరల్‌లో 76.0, దుబ్బాకలో 72.5, నంగునూర్‌లో 70.0, అక్కన్నపేటలో 70.3, నారాయణరావుపేటలో 66.8, కోహెడలో 63.5, హుస్నాబాద్‌లో 62.0, చిన్నకోడూర్‌లో 61.5, రాయపోల్‌లో 52.5, బెజ్జంకిలో 45.8, చేర్యాలలో 42.0, కొండపాకలో 40.3, వర్గల్ 39.3, మద్దూరులో 32.5, మర్కూక్‌లో 30.5, దూలిమిట్టలో 30.0, ములుగు 28.8, మిరుదొడ్డిలో 28.8, తొగుటలో 27.0, అక్బర్‌పేట-భూంపల్లిలో 24.3, దౌల్తాబాద్‌లో 16.5, కుకునూరుపల్లిలో 16.5, గజ్వేల్‌లో 13.8, కొమురవెల్లిలో 12.0, జగదేవ్‌పూర్ మండలాల్లో 10.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నాలుగైదు రోజుల నుంచి వాతావరణం చల్ల బడడంతో జిల్లావాసులు ఉపశమనం పొందుతున్నారు. పలు గ్రామాల్లో చెరువులు పొంగిపొర్లుతుండటంతో చూడటానికి ఆసక్తి కనబరుస్తున్నారు.



పొంగిపొర్లుతున్న ఇబ్రహీంపూర్ చెరువు




చిన్నకోడూరు శివారులో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు



పొంగిపొర్లుతున్న నర్సాపూర్ చెరువు

పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి : సీపీ

సిద్దిపేట క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొన్నిరోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీరు చేరుకుంది. ఈ సమయంలో ఈతకు వెళ్లే పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉం డాలని, లేదంటే ఈత సరదా విషాదాన్ని నింపే అవకాశం ఉందని సీపీ అనురాధ గురువారం ప్రకటనలో సూచించారు. ఒంటరిగా, స్నేహితులతో ఈతకు పంపించకూడదన్నారు. పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. ప్రాజెక్టుల సందర్శనకు వచ్చేవారు లోపలికి దిగకూడదని, శని, ఆదివారాల్లో ప్రాజెక్టుల వద్ద పెద్దపెద్ద చెరువుల వద్ద పెట్రోలింగ్‌ను ముమ్మరం చేసినట్లు స్పష్టం చేశారు.



శుభమస్తు..

- శ్రావణ మాసం రాకతో ముహూర్తాలు షురూ
- 80 రోజులుగా లేని సుముహూర్తాలు
- 35 తిథుల్లో మోగనున్న పెళ్లి బాజాలు
- ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 21 వరకూ బ్రేక్
- ఆ తరువాత శుభ గడియలే

7

కల్యాణానికి క్యూకాంప్లెక్స్ పూర్తయ్యేనా?

- ఆగుతూ...సాగుతున్న పనులు..
- పనుల్లో వేగం పెంచితేనే అందుబాటులోకి..
- కానరాని అధికారుల పర్యవేక్షణ

8



నంగునూరు ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ హైమావతి

డ్యూటీ టైంలో ఆసుపత్రి వదిలితే చర్యలు

- కలెక్టర్ హైమావతి
- నంగునూరు మండలంలో ఆకస్మిక తనిఖీలు

నంగునూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్యం అందేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. గురువారం నంగునూరు మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రి, పాఠశాలను తనిఖీ చేశారు. సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి సిబ్బంది పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. డ్యూటీ టైంలో డాక్టర్ ఉండకుండా ఎక్కడికి వెళ్లారని మండిపడ్డారు. కలెక్టర్ వచ్చిన విషయం తెలుసుకొని ఆస్పత్రికి చేరుకున్న డాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్యూటీ టైంలో ఆస్పత్రి వదిలి వెళ్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రిలో పనిచేసే సిబ్బంది డిప్యూటేషన్ లేదా అత్యవసర సమయంలో సెలవుపై వెళ్తే తప్పనిసరిగా ఆర్డర్ కాపీని అందుబాటులో ఉంచాలన్నారు. ఆయుష్ డాక్టర్ రూంకు తాళం ఉండడాన్ని గమనించిన కలెక్టర్ రాష్ట్ర ఆయుష్ డైరెక్టర్‌తో మాట్లాడి ఆయుష్ డాక్టర్ రెగ్యులర్‌గా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలి

నంగునూరులో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపడితే నేరుగా లబ్ధిదారుల అకౌంట్లో డబ్బు జమ చేస్తామని చెప్పారు. గ్రామంలో ఇంటి నిర్మాణం చేపడుతున్న లబ్ధిదారులతో మాట్లాడారు. అక్కెనపల్లిలో వర్షాకాలం లో చెరువుల నుంచి ఇళ్లలోకి నీరు చేరుతున్న ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. అలాగే నంగునూరులోని ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని నంగునూరులోని పశు వైద్య కేంద్రాన్ని తనిఖీ చేశారు.

బీడీకార్మిక పిల్లలకు ఉపకార వేతనం

- జిల్లాలో సుమారు మూడు వేల మంది కార్మికుల పిల్లలకు లబ్ధి

దుబ్బాక, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికుల పిల్లల చదువుల కోసం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వశాఖ ఉపకార వేతనాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తుంది. గురువారం బీడీకార్మిక సంక్షేమనిధి వైద్యులు వెంకటేష్ ఆధ్వర్యంలో బీడీ కార్మిక దవాఖాన సిబ్బంది అన్ని విద్యాలయాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లాలో సుమారు 39,139 మంది పీఎఫ్ కార్మికులు ఉన్నారు. దుబ్బాక మండలంలో 19,374 మంది కార్మికులు పీఎఫ్ పొందుతున్న వారున్నారు. వీరందరి పిల్లలకు వివిధ కేటాగిరీల్లో ఉపకారవేతనాన్ని కేంద్ర ప్రభుత్వం అందించనుంది. ఒకటో తరగతి నుంచి పదోతరగతి విద్యార్థులు ఆగస్టు 31 లోపు దరఖాస్తులు చేసుకోవాలి. ఇంటర్ నుంచి ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులు అక్టోబరు 31లోపు దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు మీసేవ, ఆన్‌లైన్ ద్వారా గానీ దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తులు తప్పకుండా పీఎఫ్ కార్డు, గతేడాది మార్కుల జాబితా(మోమో), ఈ ఏడాది ఆదాయ ధ్రువీకరణ పత్రం, విద్యార్థుల బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్ కలిగి ఉండాలి. ఇంటర్మీడియట్, పదోతరగతి నేరుగా ఉత్తీర్ణులైన వారే అర్హులు. సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన వారికి అర్హతలేదు.

ఉపకారవేతనం ఇలా...	
1వ తరగతి నుంచి 4వ తరగతి వరకు	1000
5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు	1500
9వ తరగతి నుంచి 10 తరగతి వరకు	2000
ఇంటర్మీడియట్	3000
డిగ్రీ, ఐటీఐ, ఇతర వృత్తివిద్యా కోర్సులకు	6000
బీటెక్, బీఎంఎస్. తదితర కోర్సులకు	25000



దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్‌కు కరపత్రాన్ని అందజేస్తున్న దుబ్బాక బీడీకార్మిక సంక్షేమనిధి వైద్యులు వెంకటేష్

భవనం పైనుంచి పడి బాలుడు మృతి



సిద్దిపేట క్రైం, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రెండంతస్తుల భవనం నుంచి కింద పడిన బాలుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట పట్టణ శివారులోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలోని ఆకుల మహేష్, సంధ్య(మూగ, చెవుడు).. దంపతులకు దీలీప్ (2), ఆరునెలల పాప శ్రీవల్లి ఉన్నారు. ఈ నెల 21న మహేష్ వ్యాపారం నిమిత్తం బయటకు వెళ్లగా అతని భార్య సంధ్య వంట పనిలో నిమగ్నమైంది. ఈ క్రమంలో బాలుడు మెట్ల వద్ద ఆడుకుంటూ రేలింగ్ మధ్యలో నుంచి కిందపడిపోయాడు. గమనించిన కాలనీవాసులు కుటుంబ సభ్యుల సహాయంతో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. గురువారం సాయంత్రం దీలీప్ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

అభివృద్ధి పనుల టెండర్లకు ససేమిరా..?

హుస్నాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో రాకపోవడంతో అభివృద్ధి పనులు చేయడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు. ఒక్కో పనికి మూడు మార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు వీటిని చేయడానికి ససేమిరా అంటున్నారు. దీంతో హుస్నాబాద్ పట్టణంలో కోట్లాది రూపాయల పనులు మంజూరు దశలో ఉంటున్నాయి. పట్టణంలో రూ. 35 లక్షలతో నిర్మించే మైనార్టీ కమ్యూనిటీ హాల్‌కు నాలుగోసారి ఆన్‌లైన్ టెండర్లు పిలిచారు. రూ. 45 లక్షలతో నిర్మించే అంబేడ్కర్ భవన్‌కు నాలుగోసారి టెండర్లు పిలిచారు. రూ. 3.90 కోట్లతో పట్టణంలోని మల్లె చెట్టు చౌరస్తా నుంచి ఎల్లమ్మ చెరువు వరకు రోడ్డు వైడింగ్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ఇటీవల టెండర్లు పిలిచారు. దీని పట్ల కూడా కాంట్రాక్టర్లు నిరాసక్తత కనబరుస్తున్నట్లు సమాచారం..

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- సీసీఎస్, ఐడీఏ బొల్లారం పోలీసుల తనిఖీలు
- రూ.1.52కోట్ల విలువైన 38 కిలోల పల్లాడియం కార్బన్ స్వాధీనం
- ముగ్గురు నిందితుల అరెస్ట్, పరారీలో ప్రధాన నిందితుడు
- వివరాలు వెల్లడిరచిన సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ పంకజ

సంగారెడ్డి క్రైమ్, జూలై 24(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పోలీసులు నిర్వహించిన ఆకస్మిక వాహన తనిఖీల్లో పల్లాడియం కార్బన్ అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్నారు. నిందితుల నుంచి రూ. 1.52కోట్ల విలువైన 38 కిలోల పల్లాడియం కార్బన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గత డిసెంబర్ 1వ తేదీన ఐడీఏ బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్వీ కోఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని రాంపెక్స్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పల్లాడియం కార్బన్ దొంగతనం జరిగినట్లు పరిశ్రమ ఏజీఎం కామేశ్వర శర్మ బొల్లారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీని ఆధారంగా బొల్లారం పోలీసులు, సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగి దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 6 గంటల సమయంలో ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు ఖాజిపల్లి చౌరస్తాలో అనుమానాస్పదంగా వెళ్తున్న ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా గుట్టు రట్టయ్యింది. మహారాష్ట్ర పూణే జిల్లా దౌండ్ తాలూకా కుర్కుంబ్ గ్రామానికి చెందిన అమోల్ బాపు జాగడే (29), మహారాష్ట్ర బిగ్వాన్, తేరత్నమానగర్‌కు చెందిన రవీంద్ర భగవాన్ భదర్ (29), మహారాష్ట్ర ఉమర్గ్ తాలూకా రామనగర్ బెలంబ్ తండాకు చెందిన గణేష్ మహదేవ్ రాథోడ్ (28)లు ఒక గ్యాంగ్‌గా ఏర్పడి జిల్లాలోని వివిధ ఫార్మా కంపెనీలలో పల్లాడియం కార్బన్ దొంగతనం చేసేవారు. దీన్ని విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేసేవారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సాంబశివుడు అనే వ్యక్తి పూణేలో పని మానేసి హైదరాబాద్‌కు వచ్చి పల్లాడియం కార్బన్ లభించే ఫార్మా కంపెనీల గురించి తెలుసుకొని అమోల్ బాపు జాగడే గ్యాంగ్‌కు సమాచారం ఇచ్చేవాడు. దీంతో సదరు గ్యాంగ్ చోరీలకు పాల్పడేవారు. చోరీ చేసిన పల్లాడియం కార్బన్‌ను విక్రయించడానికి తీసుకెళ్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి 38 కిలోల పల్లాడియం కార్బన్, ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సాంబశివుడుతో పాటు అక్షయ్ చవాన్, లాలా పాటిల్‌లు పరారీలో ఉన్నారు.

వివిధ రాష్ట్రాల్లో గ్యాంగ్ చేసిన దొంగతనాలు

2022లో ఐడీఏ బొల్లారంలోని రాంపెక్స్ ల్యాబ్స్‌లో సాంబశివుడు, జాగడే గ్యాంగ్ 6.11 కిలోల పల్లాడియం కార్బన్ చోరీ చేశారు. 2023లో సాంబశివుడు గ్యాంగ్ 35 కిలోల పల్లాడియంను గుంటపల్లిలోని న్యూలాండ్ కంపెనీలో నుంచి చోరీ చేశారు. 2025లో సాంబశివుడు, ఆమోల్ గ్యాంగ్ 127.350 కిలోల పల్లాడియం కార్బన్‌ను సదాశివపేటలోని ఆరీన్ లైఫ్ సైన్సెస్ నుంచి, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలో పలు రసాయాలను దొంగతనం చేశారు.

పోలీసులకు రివార్డులు

పల్లాడియం కార్బన్ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాను చాకచక్యంగా పట్టుకున్న పోలీసులను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అభినందించి రివార్డులు అందజేశారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వి.శివకుమార్, ఇన్‌స్పెక్టర్లు పి.రాము నాయుడు, రవీందర్‌రెడ్డి, ఎస్‌ఐ శ్రీకాంత్, సిబ్బంది రెఖ్యా, అన్వర్, శశిధర్, ప్రశాంత్, ఉదయ్ కిరణ్, సతీష్, వామ్‌దాస్, మోహన్‌లను అభినందించారు. ఈ విలేకరుల సమావేశంలో పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, సీఐలు శివకుమార్, రాము నాయుడు, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నరేందర్‌గౌడ్

నలుగురు దొంగల అరెస్ట్

చిన్నశంకరంపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటుపడి చోరీలకు పాల్పడుతున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ తెలిపారు. గురువారం చిన్నశంకరంపేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ నిందితుల వివరాలను వెల్లడించారు. మద్యానికి, జల్సాలకు అలవాటుపడిన మండలంలోని ఖాజాపూర్ గ్రామానికి చెందిన చిగుల్ల మహిపాల్, చిగుల్ల కరుణాకర్, కలకంటి మాల మహేష్ (మిషన్ భగీరథ సూపర్ వైజర్), పర్శ భూపాల్ నలుగురు కలిసి దొంగతనాలకు పాల్పడుతూ వచ్చిన సొమ్మును పంచుకొని జల్సాలు చేసేవారు. ఇద్దరు నిందితులపై గతంలో దోపిడీ, నేరాల కేసులు ఉన్నట్లు విచారణలో రుజువైంది. గురువారం తెల్లవారుజామున పోలీస్ పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో నలుగురు వ్యక్తులు బస్టాండ్ వద్ద అనుమానాస్పదంగా అటూ ఇటూ తిరుగుతున్నారు. గమనించిన పోలీసులు వారి వద్దకు వెళ్లే క్రమంలో అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించగా వెంబడించి పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. మహిపాల్ పెద్దమ్మ చిగుల్ల ఎల్లమ్మ ఇటీవల మృతి చెందిదగా, మృతురాలికి సంబంధించిన బంగారు, వెండి నగలు, నగదు డబ్బులను బంధువులైన మల్లయ్య ఇంట్లో దాచి పెట్టారు. పసిగట్టిన ఈ నలుగురు నిందితులు తాళం వేసిన ఇంట్లో చొరబడి నగలు, డబ్బులను దోచుకెళ్లారు. అలాగే పలు ఇళ్లను దోపిడీ చేసినట్లు ఒప్పుకున్నారు. వీరి నుంచి 13 తులాల బంగారు నగలు, 955 గ్రాముల వెండి నాణాలు, నగదు రూ.1,24500 స్వాధీనం చేసుకున్నారు. గతంలో దోపిడీకి గురైన బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. నలుగురు నిందితులను గుర్తించి పది రోజుల్లో కేసులను ఛేదించిన రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్‌ఐ నారాయణగౌడ్, కానిస్టేబుల్ ఎస్ రాజశేఖర్, జి బాస్కర్‌ను డీఎస్పీ నరేందర్‌గౌడ్ అభినందించి, రివార్డులను ప్రదానం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ చోరీ


రంగాయపల్లి గ్రామ శివారులో దుండగులు ధ్వంసం చేసిన విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్

మనోహరాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాయపల్లి గ్రామంలో రైతుల పొలాల వద్ద రెండు రోజుల వ్యవధిలో రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ధ్వంసం చేసి దుండగులు ఆయిల్, కాపర్ వైర్లను దొంగిలించారు. సోమవారం బొట్లగడ్డ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి చోరీకి పాల్పడ్డారు. తాజాగా బుధవారం రాత్రి అదే బొట్లగడ్డకు చెందిన మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, ఆయిల్, కాపర్ వైర్లను దొంగిలించారు. వానాకాలం సీజన్‌లో వరి నాట్లు వేయాల్సిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌లు ధ్వంసం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు, పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

రాంగ్‌రూట్‌లో డ్రైవింగ్.. ఆరుగురిపై కేసు


కూచారం చివరస్తా వద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

మనోహరాబాద్, జూలై 24(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై రాంగ్‌రూట్‌లోని ప్రయాణిస్తున్న ఆరుగురు డ్రైవర్లపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిన ఘటన మనోహరాబాద్ మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం, జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మనోహరాబాద్ మండలం కూచారం 44వ జాతీయ రహదారి యూటర్న్ వద్ద ముప్పిరెడ్డిపల్లి పరిశ్రమలకు వెళ్లే వాహనాలు రాంగ్‌రూట్‌లో భారీగా వస్తుండడంతో అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో ఆంధ్రజ్యోతి పత్రికలో 'ఎదురు ప్రయాణం ప్రమాద' అని వార్త ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో పోలీసులు గురువారం ఎదురుగా వస్తున్న ఆరుగురు వాహనదారులను పట్టుకుని వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపారు. నిత్యం ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఎదురు ప్రయాణం చేస్తే కేసులు తప్పవని పోలీసులు వాహనదారులను హెచ్చరించారు. గతంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు పట్టించుకోవడం లేదని కొందరు ప్రజలు వాపోతున్నారు.

రాజీవ్ రహదారిపై టమాటా లారీ బోల్తా



కుకునూరుపల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): కారును తప్పించబోయి టమాట లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. గురువారం కర్నూల్ నుంచి కరీంనగర్‌కు టమాటాలను తీసుకువస్తున్న ఒక లారీ కుకునూరుపల్లి శివారులోని మంగోల్ ఎక్స్ రోడ్డు వద్ద కారును తప్పించబోయి బోల్తా పడింది. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలగగా, సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని లారీని పక్కకు తీశారు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు.

క్రైం కార్నర్

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలు మృతి


పోచవ్వ(ఫైల్)

అక్కన్నపేట, జూలై 24(ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలంలోని కుందనవానిపల్లి గ్రామానికి చెందిన లింగంపల్లి పోచవ్వ (75) గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, పోచవ్వ ఉదయం బట్టలు ఉతికి ఇంటి ముందున్న దండంపై ఆరవేస్తుండగా విద్యుత్ వైరు తగిలి షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని పోచవ్వ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో లారీ డ్రైవర్ ఆత్మహత్య


శ్రీను(ఫైల్)

తూప్రాన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ భరించలేక లారీ డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తూప్రాన్-2 ఎస్‌ఐ జ్యోతి కథనం ప్రకారం, తూప్రాన్ మండలం నర్సంపల్లి తండాకు చెందిన ధరావత్ హటియా కుటుంబం కొన్నేళ్లుగా మల్కాపూర్ తండాలో నివసిస్తోంది. హటియా పెద్ద కుమారుడు ధరావత్ శ్రీను (28) లారీ డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. పనులు దొరకకపోవడంతో శ్రీనుకు అప్పులు పెరిగిపోయాయి. వీటిని తీర్చే మార్గం లేకపోవడంతో ఈనెల 19న తూప్రాన్ పట్టణ శివారులోని రాములగుడి వద్ద గడ్డి పురుగులమందు తాగాడు. ఈ విషయాన్ని తమ్ముడు శ్రీకాంత్‌కు ఫోన్ చేసి చెప్పడంతో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందాడు. సోదరుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జ్యోతి తెలిపారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



హుస్నాబాద్ రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మండలం మీర్జాపూర్ గ్రామానికి చెందిన గొర్ల వీరన్నయాదవ్‌కు చెందిన పాడి ఆవు గురువారం సాయంత్రం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. సాయంత్రం మేత కోసం ఆవును విడిచిపెట్టగా, అది మేత మేస్తూ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందింది. దాదాపు రూ.లక్ష నష్టం జరిగినట్లు పేర్కొన్నారు.



రెయిన్ డే ఉత్సవాలు

హుస్నాబాద్ రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో గురువారం రెయిన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గొడుగులు పట్టుకుని, రెయిన్ కోట్‌లు ధరించి నృత్యాలు చేస్తూ అలరించారు.

పటాన్‌చెరు పరిశ్రమలో కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

- రూ. 61లక్షల పరిహారం చెల్లించేందుకు అంగీకారం


యాజమాన్యం, బాధిత కుటుంబ సభ్యులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పటాన్‌చెరు పరిధి అగర్వాల రబ్బర్ పరిశ్రమలో గురువారం కరెంట్ షాక్‌తో ఓ కాంట్రాక్ట్ కార్మికుడు దుర్మరణం చెందాడు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే కార్మికుడు మృతి చెందాడని బాధిత కుటుంబ సభ్యులు, కార్మికులు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి రంగంలోకి దిగి బాధిత కుటుంబానికి మొత్తం రూ. 61 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చేలా యజమాన్యాన్ని ఒప్పించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. అగర్వాల్ రబ్బర్ పరిశ్రమలో బీహార్‌కు చెందిన సురేష్‌సింగ్ యాదవ్ 12 ఏళ్లుగా కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమార్తెలతో కలిసి బండ్లగూడలో నివాసం ఉంటున్నాడు. రోజులాగే విధులకు హాజరైన సురేష్‌సింగ్ గురువారం మధ్యాహ్నం పని చేస్తుండగా, ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు. విషయం తెలిసిన తోటి కార్మికులు, బాధిత కుటుంబం అక్కడికి వచ్చి యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే సురేష్‌సింగ్ మృతి చెందాడని ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం రూ. 5లక్షలు మాత్రమే ఇస్తానని చెప్పింది. దీంతో కొందరు కార్మికులు విషయాన్ని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పరిశ్రమ యాజమాన్యంతో చర్చించారు. దీంతో యాజమాన్యం దిగి వచ్చి కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబానికి రూ. 55 లక్షల పరిహారం ఇచ్చేందుకు అంగీకార పత్రాన్ని రాసి ఇచ్చారు. అలాగే, లేబర్ కాంట్రాక్టర్ రూ. 5 లక్షలు, అంత్యక్రియలు, ఇతర ఖర్చుల కోసం రూ. లక్ష తక్షణ సహాయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ పరిశ్రమల్లో కార్మికులు చనిపోతే యాజమాన్యాలు వారి కుటుంబాలను ఆదుకునేందుకు మానవత్వంతో వ్యవహరించాలని కోరారు.

బిస్లరీతో ఐఐటీహెచ్ ఒప్పందం

- బాటిల్ ఫర్ చేంజ్‌తో ప్లాస్టిక్ రీసైక్లింగ్

కంది, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వ్యర్థాలను అరికట్టాలని లక్ష్యంతో బిస్లరీ సంస్థతో సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్ గురువారం ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ మేరకు ఇరు సంస్థల ప్రతినిధులు ఎంఓయూలపై సంతకాలు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాల రీసైక్లింగ్, విభజన, పారవేయడంపై దృష్టి సారించడం ద్వారా స్థిరమైన వ్యర్థాల నిర్వహణ పద్ధతులను ప్రోత్సహించే దిశగా ఈ సహకారం ఒక ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు. ప్లాస్టిక్ రీసైక్లింగ్‌ను ప్రోత్సహించేందుకు బాటిల్స్ ఫర్ చేంజ్ చొరవ కింద బిస్లరీతో కలిసి ఐఐటీ హైదరాబాద్ ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేయనుంది. ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌ను నిర్మించడమే తమ లక్ష్యమని ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి అన్నారు.


ఒప్పంద పత్రాలను చూపుతున్న ఐఐటీహెచ్ శాస్త్రవేత్తలు బిస్లరీ సంస్థ ప్రతినిధులు

బాలుడి మృతి కేసులో వ్యక్తి అరెస్ట్

కొమురవెల్లి, జూలై 24(ఆంధ్రజ్యోతి): బాలుడి మృతి కేసులో ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. చేర్యాల సీఐ ఎల్.శ్రీను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 26వ తేదీన కొమురవెల్లి నుంచి రాజీవ్ రహదారి కామనకు వెళ్లే దారిలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టి మైనర్ బాలుడు రాంచరణ్ మృతి చెందాడు. ఈ కేసులో విచారణ జరిపి, మైనర్ బాలుడికి బైక్ ఇచ్చినందుకు అదే గ్రామానికి చెందిన తిరుపతి ఆంజనేయులును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వడం చట్టరీత్యా నేరమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో వాహనాలు ఇవ్వవద్దన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఇతరులతో వెళ్లేటప్పుడు గమనించాలని సూచించారు.



భారీ పగుళ్లు వచ్చిన తరగతి గదిలోని గోడలు



ఇప్పుడున్న రెండు తరగతి గదులు సరిపోక వరండాలో కూర్చున్న విద్యార్థులు

శిథిలబడి..

కూలితే అంతే మరి!

ప్రమాదంలో నర్సాపూర్ పాఠశాల పాత భవనం

నర్సాపూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్‌లో ఆర్డీవో కార్యాలయం పక్కనే ఉన్న ప్రాథమిక పాఠశాల పాత భవనం కూలిపోయే స్థితిలో ఉంది. పూర్తిగా శిథిలావస్థకు చేరిన ఈ కట్టడం ఎప్పుడు కూలుతుందోనని పక్కనే చదువుకుంటున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారింది. ఈ పాత భవనం పక్కనే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అలాగే ప్రాథమిక పాఠశాలకు చెందిన ఇతర తరగతి గదులు ఉన్నాయి. వర్షాలు లేని సమయంలో కొన్ని తరగతులు ఈ శిథిలావస్థ భవనంలోనే కొనసాగేవి. ఇటీవల ముసురు కారణంగా ఆ తరగతులను తాత్కాలికంగా పక్కనే ఉన్న ఉన్నత పాఠశాల భవనంలోని గదిలోకి మార్చారు. కొత్తగా నిర్మించిన రెండు గదులు సరిపోక విద్యార్థులను వరండాలలో కూడా కూర్చోబెడుతున్నారు. గత ప్రభుత్వంలో మన ఊరు - మన బడి పథకం కింద ఇక్కడ కొత్త భవన నిర్మాణానికి రూ.50 లక్షలు మంజూరై, టెండర్ కూడా పూర్తయినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యం పట్ల స్థానికులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. ప్రమాదం జరగకముందే ఈ పాత భవనాన్ని కూల్చివేసి, కొత్త పాఠశాల భవనాన్ని నిర్మించాలని స్థానికులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



తరగతిగది తలుపుల దుస్థితి

261 ఉపాధ్యాయుల సర్దుబాటు

మెదక్ అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లాలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. వారం రోజులుగా కొనసాగుతున్న సవరణల కసరత్తుకు తెరపడింది. ఉపాధ్యాయులను ఆయ పాఠశాలలకు సర్దుబాటు చేస్తూ.. సిద్ధం చేసిన తుది జాబితాకు కలెక్టర్ రాహుల్ రాజ్ ఆమోదం తెలపడంతో జిల్లాలో 261 ఉపాధ్యాయును విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన బడులకు సర్దుబాటు చేశారు. నేడు శుక్రవారం కేటాయించిన పాఠశాలలో ఉపాధ్యాయులు రిపోర్టు చేయాలని డీఈవో రాధాకిషన్ తెలిపారు.

సమాచార హక్కు చట్టం అమలు తప్పనిసరి

సమాచార హక్కు చట్టం అమలు తప్పనిసరి అని పెండింగ్ దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టంపై పౌర సమాచార అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సుకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 29న రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, రాష్ట్ర సమాచార కమిషనర్లు మెదక్‌కు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డీఆర్వో భుజంగరావు, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవోలు, తదితరులు పాల్గొన్నారు.

వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

● మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



మెదక్ అర్బన్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో సూచించారు. రైతులు పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. నదీ పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమ్తంగా ఉండాలని, వాగులు, వంకలు, మత్తడి దూకే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు తమ భద్రతను దృష్టిలో ఉంచుకొని వాటి వద్దకు వెళ్లవద్దని సూచించారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. జలాశయాలు, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల్లోకి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు. ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీసు శాఖ ముందస్తుగా పకడ్బందీ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఎస్‌హెచ్‌వోలు తమ పరిధిలో ఉన్న చెరువులు, కుంటలను సందర్శించి, ప్రమాద అంచున ఉన్న ఆనకట్టల సమాచారం అందించాలని ఆదేశించారు. ఎవరైనా ఆపదలో ఉంటే వెంటనే పోలీసు కంట్రోల్ రూం నంబర్ 8712657888, లేదా డయల్ 100కి కాల్ చేసి సహాయం పొందాలని తెలిపారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

● మాజీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు సందర్భంగా..



బర్త్‌డేకు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా యువనాయకుడు అనంత్‌రెడ్డి,తదితరులు

న్యూస్‌నెట్‌వర్క్: మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో వేడుకలు జరిగాయి. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా కొండాపూర్ మండలం గుంతపల్లిలో బీఆర్ఎస్ యువజన నాయకుడు అనంత్‌రెడ్డి పాఠశాల విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. జిన్నారం మండలం మాదారంలో మండల నాయకుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జహీరాబాద్‌లో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌లు కేక్ కట్ చేశారు. మెదక్‌లో జరిగిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. గుమ్మడిదలలో చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. నర్సాపూర్‌లో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, వివిధ ప్రాంతాల్లో జరిగిన వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్‌రెడ్డి

మెదక్ అర్బన్, జూలై 24(ఆంధ్రజ్యోతి): ఏ రూపంలోనైనా మత ప్రాతిపదికన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకిస్తుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కిషోర్‌రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం బీసీ రిజర్వేషన్‌పై బీజేపీ జిల్లా అధ్యక్షులు మల్లేశం గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అసెంబ్లీలో బిల్లు తీసుకొస్తే.. బీజేపీ సంపూర్ణ మద్దతు ఇచ్చిందన్నారు. కానీ, ఆర్డినెన్స్ రాక ముందే, అందులో 10 శాతం ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్లు ఇవ్వాలని కుట్ర చేయడం జరుగుతుందన్నారు.కాంగ్రెస్ సర్కార్ బీసీ సమాజాన్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని, బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో. మాజీ జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఎంఎల్ఎస్ రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాగి రాములు, సుభాష్‌గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ మధు, నాయకులు ప్రభాకర్, రంజిత్‌రెడ్డి, రాజేందర్, నాగరాజ్, శ్రీనివాస్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

'కోటి ప్రకటించి పది లక్షలెలా ఇస్తారు?'

సంగారెడ్డి రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): సిగాచి పరిశ్రమలో జరిగిన ఘటనలో మృతి చెందిన కార్మిక కుటుంబాలకు నష్టపరిహారం కోటి రూపాయలు ప్రకటించి రూ.పది లక్షలు ఎలా ఇస్తారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, పాశమైలారం ఇండస్ట్రియల్ క్లస్టర్ కన్వీనర్ మాణిక్యం గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పరిశ్రమలో దుర్ఘటన జరిగి 25 రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు యాజమాన్యంపై చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యమేమిటనని పేర్కొన్నారు. సీఎం ఇచ్చిన హామీ గాలిమాటలుగానే మిగిలిపోయాయని తెలిపారు. నష్టపరిహారం చెల్లించడంలో ఎవరి నిర్లక్ష్యమో తెలుపాలని కోరారు. పరిశ్రమ యాజమాన్యం ఆస్తులు జప్తు చేసి ఒకే విడతలో కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించి యాజమాన్యాన్ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని పేర్కొన్నారు.





శుభమస్తు..

శ్రావణ మాసం రాకతో శుభ ముహూర్తాలు షురూ

● 80 రోజులుగా సుముహూర్తాలు లేవ్

● 35 తిథుల్లో మోగనున్న పెళ్లి బాజాలు

● ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 21 వరకు బ్రేక్

● ఆ తరువాతా శుభ గడియలే

జోగిపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదురుచూస్తున్న శుభ గడియలు రానే వచ్చాయి. శ్రావణ మాసం ప్రారంభం కావడంతో ఈ నెల 26 నుంచి శుభకార్యాలకు ముహూర్తాలు జోరందుకోనున్నాయి. పెళ్లిళ్లతో పాటు గృహప్రవేశాలు, నూతన వ్యాపార ప్రారంభాలు, వాహనాల కొనుగోళ్ల వంటి శుభ కార్యాలకు మంచి రోజులు వచ్చాయి. ఈ నెల 26 నుంచి మొదలై, భాద్రపద మాసం మినహా డిసెంబర్ వరకు ఏకధాటిగా 35 శుభ తిథుల్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి.

రేపటి నుంచి శ్రావణం..

ఆషాఢ మాసం, భాద్రపద మాసాలను శూన్య మాసాలుగా పరిగణిస్తారు. ఈ నెలల్లో శుభ కార్యాలు నిర్వహించరు. జూలై 25న శుభ శ్రావణ మాసం ప్రారంభం కావడంతో మరుసటి రోజు నుంచే శుభకార్యాలకు ముహూర్తాలు మొదలయ్యాయి. తమ నక్షత్రాల ప్రకారం అనువైన ముహూర్తాల కోసం జంటలు పురోహితుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఈ శుభ గడియలను వినియోగించుకుని తమవాని పెళ్లిళ్లకు తల్లిదండ్రులు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఫంక్షన్ హాళ్లు, కన్వెన్షన్ సెంటర్లకు గిరాకీ పెరిగింది. కొత్త దుస్తులు, బంగారం, ఇతర వివాహ సామగ్రి కొనుగోళ్లు జోరందుకోవడంతో వ్యాపార సముదాయాలు కళకళలాడుతున్నాయి.

మూడు నెలలుగా ముహూర్తాల్లేవు

గత మే మాసం చివరి వారం నుంచి సుముహూర్తాలు లేవు. మే 26 నుంచి జూలై 27 వరకు గురు మౌఢ్యమి ఉండడం వల్ల సుమారు 80 రోజుల పాటు సుముహూర్తాలు లేకపోవడంతో వివాహాలు జరగలేదు. అయితే, శ్రావణం మొదలు మధ్యలో భాద్రపద మాసం మినహాయిస్తే సుమారుగా 40 రోజులు మంచి రోజులు కావడంతో శుభ ముహూర్తాలున్నాయి. ఆ తర్వాత, నవంబర్ 27 నుంచి ఫిబ్రవరి 17 వరకు శుక్రమౌఢ్యం ఉండడంతో పెళ్లిళ్లకు అత్యంత అనుకూలమైన మాఘమాసంలోనూ సుముహూర్తాలు లేకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఉన్న 35 తిథుల్లో ఉన్న శుభ ముహూర్తాలకు ఎక్కువ డిమాండ్ ఏర్పడింది.

వరుస వివాహాలతో కళకళలాడుతున్న వివిధ రంగాలు

ఒక పెళ్లి కేవలం రెండు కుటుంబాలను కలపడమే కాదు, అనేక వృత్తుల వారికి ఉపాధిని కల్పిస్తుంది. పురోహితులు, అవుసలి వారు (బంగారు పనివారు), ఫంక్షన్ హాళ్లు, డెకరేటర్లు, కేటరర్లు, ఫొటో, వీడియోగ్రాఫర్లు, బాజా భజంత్రీలు, కూరగాయల దుకాణాలు, బ్యూటీ పార్లర్లు, వస్త్ర దుకాణాలు, ఆభరణాల షాపులు, గృహోపకరణాల దుకాణాలు... ఇలా ఎన్నో రకాల వ్యాపారాలు పెళ్లిళ్లతో కళకళలాడుతున్నాయి. పెళ్లిళ్లకు ముహూర్తాలు రాగానే తల్లిదండ్రులు తమ తాహతుకు తగ్గ ఫంక్షన్ హాళ్లను బుక్ చేసుకుంటున్నారు. పెళ్లి మండపాలను అలంకరించే డెకరేషన్ వర్కర్లకు కూడా గిరాకీ బాగా పెరిగింది. వేద మంత్రాలతో వివాహ క్రతువును సంప్రదాయబద్ధంగా నిర్వహించే పురోహితులకు ఈ పెళ్లిళ్ల సీజన్‌తో చేతినిండా పని దొరుకుతోంది.

మాసాల వారీగా శుభ ముహూర్తాలు

జూలై :	27, 30, 31
ఆగస్టు:	1, 3, 5, 7, 8, 9, 10, 11, 12, 13, 14, 17, 18
సెప్టెంబరు:	24, 27
అక్టోబరు:	5, 8, 11, 12, 24, 26, 27, 29, 30, 31
నవంబరు:	1, 7, 8, 13, 15, 23, 26

3 నెలల నష్టాన్ని కొంతైనా పూడ్చుకోవచ్చు..



గత 3 నెలల కాలంలో శుభ తిథులు లేకపోవడంతో రూ. కోట్లు వెచ్చించి నిర్మించిన ఫంక్షన్ హాళ్లు గిరాకీ లేక వెలవెలబోయాయి. మా దగ్గర పనిచేసేవాళ్లకు జీతాలివ్వడమే కష్టంగా మారింది. ఇప్పుడు ముహూర్తాలు రావడంతో మూడు నెలల కాలంలో జరిగిన నష్టంలో కొంతలో కొంతైనా పూడ్చుకోవచ్చు.

- హన్మంతరావుపేట ప్రదీప్ గౌడ్, ఫంక్షన్ హాల్ నిర్వాహకుడు

చేతిఇండా పని దొరుకుతుంది..



అసలే బంగారం ధరలు రూ. లక్షకు చేరుకున్న దశలో ప్రజలు బంగారు ఆభరణాలు చేయించుకోవడం తగ్గిపోయింది. దీంతో ఇదే కులవృత్తిలో ఉన్న మాకు ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. అయితే, మన సంప్రదాయంలో శుభ కార్యాలకు బంగారం కొనుగోలు, ఆభరణాల తయారీ అనేది తప్పనిసరి ఆచారం. 35 రోజుల ముహూర్తాల నేపథ్యంలో మాకు చేతినిండా పని దొరుకుతుంది.

-రవికుమార్‌చారి, బంగారు ఆభరణాల తయారీదారుడు

మొత్తం 35 శుభ ముహూర్తాలు..



శ్రావణ మాసంలో 16 సుముహూర్తాలున్నాయి. ఆ తర్వాత ఆగస్టు 21 నుంచి సెప్టెంబరు 21 వరకు భాద్రపద మాసంలోనూ వివాహాలుండవు. మళ్లీ ఆశ్వీయుజ మాసం 6 సుముహూర్తాలు, కార్తీక మాసంలో 11 శుభ తిథులున్నాయి. నవంబరులో 2 మాత్రమే శుభ గడియలున్నాయి. ఆగస్టు నుంచి నవంబర్ వరకు మొత్తం 35 శుభ ముహూర్తాలు ఉన్నాయి.

-శిలాంకోట ప్రవీణాచార్యులు,వైదీక, స్మార్త పురోహితులు

గిరాయిపల్లి యాదిలో..

(5వ పేజీ తరువాయి)

చడంతో జనార్దన్ దళం అజ్ఞాతంలోకి వెళ్లింది. అప్పటికీ సిర్సనగండ్ల వ్యాపారి హత్యతోపాటు మరొకరిని హత్య చేసేందుకు జనార్దన్ దళం వ్యూహం రచించిందని పోలీసులు భావించారు. దీంతో ఎమర్జెన్సీ చీకటి రోజుల కారణంగా లభించిన అసాధారణ అధికారాలను ఉపయోగించారు.

నలుగురిని కాల్చిచంపి..

సిద్దిపేటలో ఆశ్రయం పొందుతున్న జనార్ధన్‌ను 1975 జూలైలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లో పార్టీ పనిమీద ఉన్న మిగతా ముగ్గురు మురళిమోహన్, సుధాకర్, ఆనందరావులనూ పట్టుకున్నారు. నలుగురినీ బంధించి ములుగు అటవీ గృహంలో 20 రోజుల పాటు చిత్రహింసలకు గురిచేసి గిరాయిపల్లి అడవుల్లో చెట్లకు కట్టేసి కాల్చి చంపారని అప్పట్లో పౌరహక్కుల సంఘం నేతలు ఆరోపించారు. 1975 జూలై 25 శుక్రవారం రోజున ఎన్‌కౌంటర్ జరిగితే ఐదు రోజుల తర్వాత అంటే బుధవారం పత్రికల్లో వార్త ప్రచురితమైంది. ఎమర్జెన్సీ సమయం కావడంతో ఆనాడు పోలీసుల విస్తృత అధికారాలను ప్రశ్నించేవాళ్లు లేకపోయారు.

నాటి ప్రధానమంత్రి దృష్టికి..

అత్యవసర పరిస్థితి ఎత్తివేయడం, అదే సంవత్సరం జరిగిన ఎన్నికల్లో కేంద్రంలో జనతా ప్రభుత్వం ఏర్పడింది. దీంతో ఉద్యమకారులు, విప్లవకారులు ఊపిరి పీల్చుకున్నారు. జనతా ప్రభుత్వం ఏర్పడగానే గిరాయిపల్లి ఎన్‌కౌంటర్‌పై దృష్టి సారించారు. నిరాయుధులైన నలుగురు రాడికల్ సంఘం విద్యార్థులను పట్టుకుని చెట్లకు కట్టేసి కాల్చి చంపారని ఆరోపిస్తూ పౌరహక్కుల సంఘం నేతలు ప్రశ్నించారు. సోషలిస్టుగా పేరుగాంచిన అప్పటి కేంద్ర మంత్రి జార్జి ఫెర్నాండేజ్ దృష్టికి తీసుకెళ్లారు. భారత లోక్‌సభలో జార్జి ఫెర్నాండేజ్ కారణంగా చర్చకు దారి తీసింది. ఆనాడు ప్రధాని మొరార్జీ దేశాయ్, హోంమంత్రి చరణ్‌సింగ్‌ను కలిసి ఎన్‌కౌంటర్‌పై న్యాయ



సూరపనేని జనార్దన్, లంకా మురళీమోహన్‌రెడ్డి , ఆనందరావు సుధాకర్ (ఫైల్ పాటోలు)

విచారణ చేయాలని పౌరహక్కుల నేతలు, మంత్రిగా ఉన్న ఫెర్నాండేజ్ కోరారు. ఈ క్రమంలో సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ వశిష్ఠ భార్గవ్‌కు విచారణ బాధ్యతలు అప్పగించారు. పలు కారణాల వల్ల భార్గవ కమిషన్ రద్దయ్యింది. ఆ తర్వాత పీపుల్స్‌వార్ తెలుగు రాష్ట్రాల్లో బలపడింది.

గిరాయిపల్లి దళానికి శ్రీకారం..

దట్టమైన అటవీ ప్రాంతంగా పేరుగాంచిన కొండపాక మండలం గిరాయిపల్లిలో ఎన్‌కౌంటర్ జరగడంతో ఆ ఊరిపేరు ఒక్కసారిగా దేశమంతటా మార్మోగింది. ఇప్పటికీ విప్లవ ఉద్యమంలో గిరాయిపల్లికి ప్రత్యేక స్థానం ఉంది. తదనంతర పరిణామాల్లో గిరాయిపల్లి పేరిట పీపుల్స్‌వార్ దళం ఏర్పాటైంది. పీడిత, తాడిత వర్గాల పక్షాన దళసభ్యులు పోరుబాట పట్టారు. ప్రధానంగా సిద్దిపేట, గజ్వేల్‌తో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాలో గిరాయిపల్లి దళ ప్రభావం ఎంతో ఉంది. కాలక్రమేణా మెతుకుసీమలో విప్లవోద్యమం కనుమరుగైంది.

కాగా ప్రస్తుతం కగార్ ఆపరేషన్ ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో 50 ఏళ్ల క్రితం జరిగిన గిరాయిపల్లి ఎన్‌కౌంటర్ గురించి, మృతవీరుల అమరత్వాన్ని విప్లవ అభిమానులు నెమరు వేసుకుంటున్నారు. గిరాయిపల్లి అమరుల గుర్తుగా అటవీప్రాంతంలోని గుట్టల్లో స్థూపాలు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.

కృష్ణ జిల్లా ఉయ్యూరులో గిరాయిపల్లి అమరుల స్మారక స్థూపం



సీపీఆర్‌పై అవగాహన

కొండపాక, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మండలం మర్పడగ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సిద్దిపేట మెడికల్ కళాశాల సిబ్బంది డాక్టర్లు సీపీఆర్ విధానంపై గురువారం అవగాహన కల్పించారు. గుండె నొప్పితో అత్యవసర సమయంలో సీపీఆర్ చేసి ప్రాణాలను కాపాడవచ్చని ఇది ఎలా చేయాలో అనే విషయాలను ప్రాక్టికల్ గా చూపించారు. అత్యవసర సమయంలో ప్రాణాలను కాపాడిన వారమైతామని తెలిపారు. సిద్దిపేట మెడికల్ కళాశాల డాక్టర్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భైరయ్య ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషి

గజ్వేల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ కమిషనర్ చెట్లపల్లి బాలకృష్ణ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని సంగుపల్లిలో రోడ్డు, మురికి కాలువను, రింగ్ రోడ్డు నుంచి క్యాసారం గ్రామానికి వచ్చే అనుసంధాన రోడ్డును ఆయన మున్సిపల్ ఏఈ మహేశ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాధాన్య క్రమంలో మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఒంటరి కొండల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

దుబ్బాక బీసీ హాస్టల్‌కు సొంతభవనం నిర్మించాలి

దుబ్బాక, జూలై24 (ఆంధ్రజ్యోతి): దుబ్బాక పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహానికి సొంతభవనం నిర్మించాలని టీజీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఇస్తారిగల్ల చరణ్‌తేజా డిమాండ్ చేశారు. గురువారం టీజీవీపీ ఆధ్వర్యంలో వసతి గృహం ముందు ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 16 ఏళ్లుగా విద్యార్థులు పెంకిటిళ్లలోని వసతి గృహంలోనే ఉంటున్నారన్నారు. కనీస వసతులు లేని వసతి గృహంలో స్నానాలు చేయడానికి కూడా అవకాశం లేదన్నారు. చదువుకునేందుకు కనీసం హాల్ కూడా లేదన్నారు. వర్షం వస్తే, కనీసం ఉండటానికి కూడా వసతి గృహం ఇబ్బందిగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలని చరణ్ తేజా డిమాండ్ చేశారు.

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

- జిల్లా వైద్యాధికారి డాక్టర్, సీహెచ్. ధనరాజ్

ములుగు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో వైద్యులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్యాధికారి ధనరాజు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రమైన ములుగులో ప్రాథమిక వైద్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాల దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.

భూనిర్వాసితులపై కేసులు కొట్టేసిన కోర్టు

అక్కన్నపేట, జూలై 24 (ఆంధ్రజ్యోతి): "గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులపై పెట్టిన కేసులను గురువారం సిద్దిపేట కోర్టు కొట్టివేసింది. 2022 సంవత్సరంలో పరిహారం చెల్లించిన తర్వాతనే గౌరవెల్లి ప్రాజెక్టు పనులు మొదలు పెట్టాలని డిమాండ్ చేస్తూ హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట భూ నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులకు భూ నిర్వాసితులకు మధ్య గొడవ జరగగా 17 మంది భూ నిర్వాసితుల పైన పోలీసులు కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి కోర్టులో కేసు విచారణ జరుగుతుంది. సాక్షులను విచారించిన సిద్దిపేట కోర్టు కేసును కొట్టివేశారు.

పీహెచ్‌సీ పునరుద్ధరణ పనుల పరిశీలన

మద్దూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆస్పత్రి పునరుద్ధరణ పనులని హుస్నాబాద్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఆనంద్ గురువారం సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్ డిడిగం రాజేశానికి పనుల వేగవంతానికి చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆస్పత్రిలో ఐఎల్ఆర్‌కు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్త కూడదనే ఉద్దేశంతో ఇన్వర్టర్ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్ పనుల ఏర్పాటుకు సహకరించాలని సూచించారు.

కల్యాణానికి క్యూకాంప్లెక్స్ పూర్తయ్యేనా?

- ఆగుతూ...సాగుతున్న పనులు..
- పనుల్లో వేగం పెంచితేనే అందుబాటులోకి..
- కానరాని అధికారుల పర్యవేక్షణ



కొనసాగుతున్న క్యూకాంప్లెక్స్ నిర్మాణ పనులు

కొమురవెల్లి, జూలై24 (ఆంధ్రజ్యోతి): మల్లన్న కల్యాణం నాటికి క్యూకాంప్లెక్స్ భవనం పూర్తవుతుందో లేదో అని స్థానికులు, భక్తులు ఆందోళన పడుతున్నారు. కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో క్యూకాంప్లెక్స్ నిర్మించి భక్తులకు పలు రకాల సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం 2023వ సంవత్సరం జూలై నెలలో మల్లికార్జున స్వామి దేవస్థానానికి రూ.12 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేసింది.

క్యూకాంప్లెక్స్ భవనాన్ని 18 నెలల్లో అందుబాటులోకి తీసుకురావాల్సి ఉన్నా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. నిర్మాణ పనులు ఆగుతూ.. సాగుతున్న నేపథ్యంలో వచ్చే మల్లన్న కల్యాణం నాటికి క్యూకాంప్లెక్స్ భవనం అందుబాటులోకి వస్తుందా అనే సందేహం స్థానికులు, భక్తుల్లో కలుగుతుంది.

భక్తులకు తప్పనున్న తిప్పలు

గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు రెండు అంతస్థుల్లో చేపట్టిన క్యూకాంప్లెక్స్ భవనం అందుబాటులోకి వస్తే దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు ఉండవు. గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఒక్కో అంతస్థులో దాదాపు 800 నుండి 1000 మంది భక్తులు వేచి ఉండే అవకాశం ఉంది.



రెండు నెలల్లో అందుబాటులోకి తీసుకురావాలని క్యూకాంప్లెక్స్ భవనం నిర్మాణ కాంట్రాక్టర్‌కు సూచించాము. ఇప్పటివరకు దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయి. పనుల్లో వేగం పెంచాలని చెప్పాము. ఇప్పటివరకు రూ.5,21,18,125 లు దేవస్థానం నిధుల నుండి చెల్లింపులు జరిగాయి. తొందరలోనే కాంట్రాక్టర్‌తో నిర్మాణ పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తాం.

-సిరంసెట్టి అన్నపూర్ణ, కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవస్థానం ఈవో

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

- జీవో 317ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి
- యూపీఎస్సీ నాయకుల డిమాండ్



తహసీల్దారు కార్యాలయంలో నాయబ్ తహసీల్దారు భార్గవ్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

గజ్వేల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలని యూపీఎస్సీ నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో దశల వారి పోరాట కార్యక్రమంలో భాగంగా మొదటి దశ కార్యక్రమంలో గజ్వేల్ మండల నాయబ్ తహశీల్దార్‌కి వినతీపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే పీఆర్‌సీని ప్రకటించాలని, ఉపాధ్యాయుల బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన వారికి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. వారితో టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు వలీఅహ్మద్, రాష్ట్ర నాయకులు వి.సత్యనారాయణ, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి డి. రాజయ్య, రాష్ట్ర కమిటీ సభ్యురాలు ప్రభావతి, గజ్వేల్ జోన్ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షురాలు మంజుల, జిల్లా కార్యదర్శి శివలింగం, టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, గజ్వేల్ మండల ప్రధాన కార్యదర్శి గోక విద్యాసాగర్, టిపిటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు రామచంద్రం, పాపిరెడ్డి, రాజులు, ప్రశాంత్, మల్లయ్య, ఎల్లయ్య, శ్రీనివాస్, పాష తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీదే విజయం

సిద్దిపేట రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్ ముదిరాజ్ కార్యకర్తలకు సూచించారు. గురువారం సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల స్థానిక సంస్థల ఎన్నికల మండల కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా భైరి శంకర్ ముదిరాజ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నిధుల గురించి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ప్రజలకు అమలుకు నోచుకుని వాగ్ధానాలు ఇచ్చి మోసం చేస్తుందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల ప్రబారి తుంగ కనకయ్య, మండల పార్టి అధ్యక్షుడు అన్నసారం సురేష్ గౌడ్, మెడికాయల శ్రీనివాస్, మండల ఎన్నికల ప్రభారి రమేష్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శులు బోయిని సురేష్, మండల ఉపాధ్యక్షులు నవీన్, రాజిరెడ్డి, జిల్లా నాయకుడె మైహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ సాగర్‌పైకి రాకపోకలు నిలిపివేత



కొండపోచమ్మ సాగర్ దారి మూసివేత

ములుగు, మర్కుక్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): కొండపోచమ్మ జలాశయాన్ని సందర్శించడానికి అనుమతులు లేవని ములుగు ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఇటీవల కొండపోచమ్మ సాగర్ వద్ద చోటు చేసుకున్న మానవీయ దుర్ఘటనల నేపథ్యంలో ప్రాజెక్టుకు శాశ్వతంగా ప్రవేశ నిషేదించడం జరిగిందన్నారు. ఈ నిర్ణయం ప్రజల భద్రతలను దృష్టిలో పెట్టుకొని తీసుకోవడమైనది. ప్రాజెక్టు పరిసర ప్రాంతంలో ఎలాంటి పర్యటనలు ఫోటోషూట్లు అనుమతి లేదని, ఎవరైనా నిబంధనలు ఉల్లంగించిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

రోటరీక్లబ్ సేవలను మరింత విస్తరించాలి

ములుగు, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు మరింత విస్తరింపజేయాలని రోటరీ ఇంటర్నేషనల్ 3150 జిల్లా గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్ తెలిపారు. బుధవారం రాత్రి రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ నూతన అధ్యక్ష కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్సీ పరామర్శ

రాయపోల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాయపోల్‌కు చెందిన గల్వ సత్తిరెడ్డి మంగళవారం మెదక్ జిల్లా నార్సింగ్ మండలం వల్లూరు వద్ద లారీ ఢీకొని మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం ఆయన అంత్యక్రియలు రాయపోల్‌లో జరుగగా మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్‌హుస్సేన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వరశర్మ, వెంకటనరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

వానాకాలం పంటలపై అవగాహన

సిద్దిపేట రూరల్,జూలై 24(ఆంధ్రజ్యోతి): వాతవరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీ.సంతోష్ కుమార్ అన్నారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం తోర్నాల వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రంలో జిల్లాలోని మండల వ్యవసాయ అధికారులకు, వ్యవసాయ విస్తరణ అధికారులకు వానాకాలం పంటల సాగుపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ జీ.సంతోష్ కుమార్ మాట్లాడుతూ.. రైతులు సాగులో రసాయన ఎరువుల వినియోగం రోజురోజుకు ఎక్కువగా వాడుతున్నారని, దీని వల్ల భూసారం తగ్గిపోయి భవిష్యత్తులో పంటల దిగుబడిపై ప్రభావం చూపుతుందన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు రసాయన ఎరువుల వాడకం తగ్గించేలా..సేంద్రియ పద్ధతుల గురించి వివరించాలని చెప్పారు. అదేవిధంగా యాజమాన్య పద్ధతులు, కలుపు యాజమాన్యంతో పాటు పలు అంశాలపై శాస్త్రవేత్తలు సూచనలు.సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి, ఏడిఏ పద్మ, ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ సిహెచ్ పల్లవి, శాస్త్రవేత్తలు రమాదేవి, శ్వేత,సరిత, తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడికి ఆర్థిక సహాయం

మద్దూరు, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : తోటి స్నేహితుడు వికలాంగత్వంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలుసుకున్న మద్దూరు ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన 1987-88 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులందరు కలిసి రూ.40 వేల ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. చేర్యాల మండలంలోని గుర్జకుంటలో ఉంటున్న స్నేహితుడు ఎం. పర్శరాములు దీన పరిస్థితి తెలుసుకున్న ఎస్సెస్సీ బ్యాచ్ తరపున రూ.20 వేలు, వ్యక్తి గతంగా స్నేహితులు బి. రమేష్ (మద్దూరు)రూ.2115/-లు, బి. మల్లేశం(వర్ధన్నపేట్) రూ.5000/-లు, బాపురెడ్డి (దానంపల్లి) రూ.5000/-లు, యు. భాస్కర్ (చేర్యాల) రూ. 5000/-లు, డి. మహేందర్ (నర్సాయపల్లి) రూ.2116/-లు అందించి మానవత్వం చాటుకున్నారు. ఆపదలో ఉన్న స్నేహితున్ని ఆదుకోవడం తమ కర్తవ్యంగా భావించినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పనుల్లో జాప్యం వద్దు



నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశలిస్తున్న అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, అధికారులు

సిద్దిపేట రూరల్, జూలై 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో జాప్యం చేయవద్దని అధికారులు ఎప్పటికప్పుడు పనులు వేగవంతం అయ్యేలా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గరీమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇళ్లు మంజూరు అయినవారు పనులు వెంటనే ప్రారంభించుకోవాలని, నిర్మాణం పనులు జరుగుతుంటే రావాల్సిన బిల్లులు వెంటనే వచ్చేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అర్హులు అయి ఉండి ఇళ్లు మంజూరు కాని వారు అధైర్యపడవద్దని దరఖాస్తు చేసుకుంటే అధికారులు సర్వే చేసి రెండో విడత జాబితాలో అందిస్తారని పేర్కొన్నారు. జెడ్పీ సీఈవో రమేష్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు శాట్జ్ గ్రీన్ సిగ్నల్

హుస్నాబాద్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ నియోజకవర్గంలో క్రీడారంగ మౌలిక సదుపాయాల కల్పనకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్జ్) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక్కడ ఏర్పాటు చేసే క్రీడల అభివృద్ధి పనులకు అంచనాలు వేసి పంపించాలని స్పోర్ట్స్ అథారిటీ రాష్ట్ర అధికారులు జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఈ నెల 7వ తేదీన రాష్ట్ర క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డిలను హుస్నాబాద్‌లోని మినీస్టేడియానికి తీసుకవచ్చి ఇక్కడి క్రీడా సదుపాయాల కల్పనకు విజ్ఞప్తి చేశారు. దీంతో హుస్నాబాద్ మినీ స్టేడియంలో 200 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణం, దీని చుట్టూ వాకింగ్ ట్రాక్‌తో పాటు ఫ్లడ్ లైట్ల అమర్చడం, కొత్తగా స్కేటింగ్ రింక్ నిర్మాణం, వాలీబాల్ సహా ఇతర క్రీడా మైదానాల నిర్మాణం, ప్రస్తుతం ఉన్న ఇండోర్ స్టేడియం వుడెన్ కోర్టును సింథటిక్‌గా మార్చడం, పైకా భవనంలో అధునాతన మల్టీ జిమ్ ఏర్పాటు చేయుటకు అమోదం తెలుపుతూ నియోజకవర్గంలోని కోహెడ, ఎల్కతుర్తిలో నూతన మినీ స్టేడియాల ఏర్పాటుకు స్థల సేకరణ చేయాలని ఆదేశాలిచ్చారు. వీటన్నింటిపై ఇంజనీరింగ్ అధికారులతో అంచనాలు రూపొందించి పూర్తి నివేదికను సత్వరమే సమర్పించాలని అన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కొండపాక, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చంద్రయ్య పేర్కొన్నాడు. కొండపాక మండలం దుద్దెడ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై గురువారం అవగాహన కల్పించారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై షీ టీమ్ నిర్వహిస్తున్న విధుల గురించి వివరించారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి మోసపోయి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థి దశ చాలా కీలకమైనదని ముందుచూపు లక్ష్యంతో విద్యార్థులు ముందుకు వెళ్లాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. చదువుకునే సమయములో చెడు అలవాట్లకు బానిస కావద్దన్నారు. ప్రతి ఒక్కరూ చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకోవడం వలన భవిష్యత్తు ఉన్నతంగా ఉంటుందని తెలిపారు. సిద్దిపేట షీటీమ్ బృందం ఏఎస్సై కిషన్, మహిళా కానిస్టేబుళ్లు మమత, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

న్యూస్‌నెట్‌వర్క్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. విద్యారంగా మరియు ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కారించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అసోసిమేట్ అధ్యక్షులు జి .తిరుపతిరెడ్డి అన్నారు.



చిన్నకోడూరు తహసీల్దార్ సలీం మియాకు వినతి పత్రం అందజేస్తున్న యూపీఎస్‌పీసీ నాయకులు

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం

బెజ్జంకి/రాయపోల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): సీసీ కెమెరాలు నేరాల నియంత్రణకు ఎంతగానో ఉపయోగపడతాయని బెజ్జంకి ఎస్సై సౌజన్య, గజ్వేల్ ఏసీపీ నరసింహులు పేర్కొన్నారు. బుధవారం ఆయన రాయపోల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. పోలీస్ సిబ్బంది కిట్ ఆర్టికల్‌లను పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నందున గ్రామాల్లో ముందస్తు సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. ఫిర్యాదిదారులతో మర్యాదగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో దాతలు రాచకొండ శివ, శైలు సహకారంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం ఎస్సై సౌజన్య ప్రారంభించి మాట్లాడారు. గంజాయి తదితర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. కేడీలు, డీసీలు, సస్పెక్ట్‌లు, రౌడీలపై మరింత నిఘా ఉంచాలని తెలిపారు.గ్రామాల్లో నేరాల నియంత్రణకై ప్రజలు, వ్యాపారస్థులు సీసీ కెమెరాల ఏర్పాటులో భాగస్వామ్యం కావాలన్నారు.

బీజేపీ జెండా ఎగుర వేయాలి

కోహెడ, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో బీజేపీ జెండా ఎగరవేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కమిటీ రెడ్డి రాంగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఎన్నికల సన్నహక కమిటీ సమావేశం నిర్వహించారు. దీనికి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోమటిరెడ్డి రాంగోపాల్ రెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు ఖమ్మం వెంకటేశం హాజరై మాట్లాడారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పార్లమెంట్ లో కోహెడ మండలాన్ని గిఫ్ట్ గా ఇచ్చేవిధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

వర్షాల దృష్ట్యా అప్రమత్తం

కుకునూరుపల్లి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్ట్యా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో సీహెచ్ ధనరాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో వ్యాధులు వ్యాపించే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా మరియు ఇతర వ్యాధులు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అలాగే ప్రజలను వ్యాధులు, ఆహారపు అలవాట్ల పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి ఓపి సేవలను అందించాలని సూచించారు. ఆయన వెంట డిప్యూటీ డిఎంహెచో శ్రీనివాస్, వైద్యాధికారిని అఖిల, సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జగదేవ్‌పూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని టీపీటీఎఫ్ అధ్యక్షుడు సత్తయ్య, కార్యదర్శి పోచయ్య అన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు విద్యారంగంలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరతూ గురువారం జగదేవ్‌పూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు, పాఠశాలలో మౌలిక వసతులను క ల్పించాలని కోరారు. ఉపాధ్యాయుల సర్దుబాటు, సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు, కేజీబీవీ మరియు మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 10 పద్దు కింద వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు శంకర్, జలందర్‌రెడ్డి, సావిత్రి. తులసీదాస్ పాల్గొన్నారు.

మార్ఫింగ్ వీడియోలతో తప్పుడు ప్రచారాలు

- అసత్యాలు ప్రచారం చేస్తే కేసులు పెడతాం
- గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్

గజ్వేల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎడిటింగ్ వీడియోలతో బీజేపీ, బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి స్వగృహంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి బుధవారం గజ్వేల్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన మాటలను ఎడిట్ చేసి వైరల్ చేయడం సిగ్గుచేటని, దమ్ముంటే ఆయన మాట్లాడిన పూర్తి వీడియోను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నేతలు సోషల్ మీడియాను నమ్ముకొని ప్రజలను మోసగిస్తుండగా, అసెంబ్లీ ఎన్నికల్లో వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పినప్పటికీ సిగ్గు రాలేదని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలపై నర్సారెడ్డి వివరిస్తూ అధికారంలో కాంగ్రెస్ ప్రభుత్వం మరో మూడేళ్లు ఉంటుందని ప్రజలకు నచ్చజెప్పి పార్టీకి అండగా నిలవాలని దిశానిర్దేశం చేయగా, కోడిగుడ్డుపై ఈకలు పీకే విధంగా దానిని తప్పుపడుతూ బీజేపీ, బీఆర్ఎస్ పార్టీ నేతలు ఆ వీడియో వైరల్ చేసినట్లు గుర్తు చేశారు. .

బెజ్జంకిలో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సభ్యులు

బెజ్జంకి, జూలై 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండారం, బేగంపేట, బెజ్జంకి గ్రామాల్లో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం సభ్యులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఆయా గ్రామాల్లో శానిటేషన్, పాఠశాలల్లో మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, డంపింగ్ యార్డులలో తడి, పొడి చెత్తను పరిశీలించి, వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, కేంద్ర బృందం సభ్యులు హరిదీప్తిప్రియ, శ్రీలత, సత్యనారాయణ, చెన్నారెడ్డి, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు తదితరులు పాల్గొన్నారు.

న్యాక్ గుర్తింపు కోసం...



దుబ్బాక డిగ్రీకళాశాలను సందర్శించిన ఓయూ చెక్‌లో భాగంగా కొలాబరేషన్ విత్ క్రిస్ప్ ప్రాజెక్ట్ బృందం

దుబ్బాక, జూలై24(ఆంధ్రజ్యోతి): కొలాబరేషన్ విత్ క్రిస్ప్ ప్రాజెక్ట్ కింద మూడు రాష్ట్రాలను ఎంపిక చేశారు. అందులోని తెలంగాణలోని ఉస్మానియా యూనివర్శిటీ పరిధిలోని 22 డిగ్రీకళాశాలలను ఎంపిక చేశారు. ఉస్మానియా యూనివర్శిటీ చెక్ ప్రాజెక్ట్‌లో భాగంగా ఎంపికైన దుబ్బాక డిగ్రీకళాశాలను గురువారం సంబంధిత ప్రాజెక్ట్ ప్రతినిధులు ప్రొఫెసర్ రమాదేవి, ప్రొఫెసర్ సత్యానారాయణ దుబ్బాక డిగ్రీకళాశాలను పరిశీలించి, సంతృప్తి చెందారు. ఈసందర్భంగా నాక్ అక్రిడేషన్‌లో మార్పులు జరిగాయని, అందులో భాగంగా నైపుణ్యం పెంచడంతోపాటు ప్రమాణాలను పెంపొందించడానికి రెండు విధానాల అక్రిడేషన్ విధానాన్ని అవలంబించనున్నట్లు తెలిపారు. అందుకు మారుమూల గ్రామాల విద్యావిధానాన్ని మెరుగుపరచనున్నట్లు తెలిపారు. దుబ్బాక కళాశాలల్లో డిజిటల్ గ్రంధాలయం నిర్వాహణతోపాటు పలు అంశాలల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భవాని సేవలు కొనియాడారు.

ఎన్నికల కోడ్ రాక ముందు ఏకగ్రీవాలు చెల్లవు

జగదేవ్‌పూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఏకగ్రీవాలు చెల్లవని జగదేవ్‌పూర్ ఎంపీడీవో రాంరెడ్డి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జగదేవ్‌పూర్ మండలం పలుగుగడ్డ గ్రామంలో గ్రామస్థులు అంతా కలిసి సర్పంచ్, ఉపసర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించడం ఎన్నికల కమీషన్ నియమావలికి విరుద్ధమని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు గ్రామాల్లో అత్యుత్సాహంతో ఏకగ్రీవ ఎన్నిక చేసుకోవద్దన్నారు.

ప్రపంచ రికార్డు కోసం ఆధ్యాత్మిక భజన ప్రదర్శన



ఆధ్యాత్మిక భజన ప్రదర్శనలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్ అందజేత

జగదేవ్‌పూర్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని అలవర్చుకుని మానసిక ప్రశాంతత పొందాలని జగదేవ్‌పూర్ భగవత్ సేవా సమాజం సభ్యులు పేర్కొన్నారు. కరీంనగర్‌లో జరిగిన ప్రపంచ రికార్డు కోసం ఆధ్యాత్మిక భజన ప్రదర్శన ప్రవీణ్‌సల్వాజి, మ్యూజికల్ గ్రూప్ కళారవళి కల్చరల్ ఆధ్వర్యంలో కళాప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో జగదేవ్‌పూర్ మండలం నుండి మునిగడప, దౌలాపూర్, జగదేవ్‌పూర్ భగవత్ సేవ సమాజం శాఖలు పాల్గొన్నాయి. ఈ భజనలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

గజ్వేల్, జూలై 24 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ చెట్లపల్లి బాలకృష్ణ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్ట్రీట్ ఫుడ్ ఫెస్టివల్ అండ్ ఎస్‌హెచ్‌జీ ప్రొడక్ట్స్ మేళాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా ఎస్‌హెచ్‌జీ నుంచి తయారు చేసిన ప్రకృతి సిద్ధమైన కారంపొడి, పసుపు, మసాలా, పచ్చళ్లు, వివిధ రకాల ప్రొడక్ట్స్ బాగున్నాయని, మహిళలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను, మెప్మా ద్వారా అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని పిలుపునిచ్చారు.